క్లుప్తంగా

స్వర్ణమ్మకు ప్రత్యేక పూజలు


స్వర్ణముఖి నదిలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి: ఇటీవల వరుసగా నాలుగు రోజుల పాటు మండలవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. శేషాచల అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో కల్యాణి డ్యాంలో 10 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం నరసింగాపురం ఆనుకుని ఉన్న స్వర్ణముఖినది పరవళ్లు తొక్కడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ మించల అశ్విని, ప్రవీణ్ కుమార్ మంగళవారం స్వర్ణముఖి నది వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టారు. స్వర్ణముఖి ప్రవహించిన ప్రతి ఏటా పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


చెక్కును అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: చంద్రగిరి మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన సంగీత(42) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయాడు. ఈ క్రమంలో ఇటీవల నారావారిపల్లిలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి తన గోడు చెప్పుకున్నాడు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు బాధితుడికి సాయం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో బాధితుడికి రూ.లక్ష చెక్కును అందించారు.

పంటల బీమాపై అవగాహన

పాకాల : రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించాలని వ్యవసాయ శాఖ తిరుపతి ఏడీఏ మనోహర్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దరామాపురం రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ స్వర్ణలత అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు అయిన పంటల వివరాలను ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా పంట యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నోటిఫైడ్ పంటలైన వరికి ఎకరాకు రూ.630, వేరుశనగకు ఎకరాకు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ పుష్పావతి, ఏఈఓలు రమేష్‌నాయక్, అమీర్, వీపీఏ ఈశ్వరి స్థానిక రైతులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యులకు సన్మానం


విజిలెన్స్ కమిటీ సభ్యులు పిపాసి, జ్యోతిని సన్మానిస్తున్న రూరల్ మండల సర్పంచ్‌లు

తిరుపతి రూరల్: తిరుపతి డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన తిరుపతి రూరల్ మండలం కేసీపేట, పద్మావతి పురం సర్పంచులు పిపాసి, జ్యోతిని పలువురు సర్పంచులు అభినందించారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారికి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో జరగనున్న డివిజన్ కమిటీ సమావేశంలో స్కావెంజర్స్ సమస్యలను చర్చించాలని కోరారు. కార్యక్రమంలో సాయి నగర్, అవిలాల, లింగేశ్వర్ నగర్, సి.మల్లవరం, ఓటేరు, బ్రాహ్మణపట్టు, సర్పంచులు డీవీ రమణ, సీవీ రమణ, కోటేశ్వరరావు, మొక్కల భారతి, లక్ష్మి, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీటీసీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష.. సమాజానికి చేటు


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

తిరుపతి రూరల్: జెండర్ ఆధారిత వివక్షత, హింసను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మంగళవారం ఓటేరు పంచాయతీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై వివక్ష సమాజానికి చేటు తీసుకొస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ తిరుపతి రూరల్ ఏపీఎం నాగేశ్వరరావు, సీసీలు, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రగిరి: రంగంపేట వద్ద ఉన్న ఓ వైన్ షాపు వెనుక ప్రత్యేక ఏర్పాట్లు



చంద్రగిరి : కొత్తపేట మద్యం దుకాణం వద్ద ప్రత్యేక సిట్టింగ్ ఏర్పాట్లు



అనధికార పర్మిట్..!

ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులతో పాటు చంద్రగిరిలో ఓ ప్రజాప్రతినిధి తన సొంత జేబు నింపుకునేందుకు కొత్తగా ప్రైవేట్ ట్యాక్స్ ప్రవేశపెట్టాడు. ఇప్పటికే ప్రభుత్వ, మఠం భూముల్లో ప్రైవేట్ ట్యాక్స్ పేరిట రూ.కోట్లు దండుకున్న ఆయన.. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో కూడా తనదైన మార్కు చూపిస్తున్నారు. తనకు కప్పం కడితే మద్యం దుకాణం వద్ద ప్రత్యేకంగా టేబుళ్లు, కావాల్సిన ఫుడ్ పెట్టుకుని అమ్ముకునేందుకు అనుమతులు ఇప్పిస్తున్నారు. అందు కోసం తనకు కమీషన ఇవ్వాల్సిందే అని మద్యం వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నాడు.

- చంద్రగిరిలో మద్యం షాపుల వద్ద విచ్చలవిడిగా వెలసిన రూములు
- బార్లను తలదన్నేలా టేబుళ్లు, నాన్‌వెజ్ ఫుడ్
- అనధికార రూముల ఏర్పాటు కోసం స్థానిక ప్రజాప్రతినిధికి ప్రైవేట్ ట్యాక్స్ చెల్లిస్తున్న మద్యం దుకాణాదారులు
- ప్రతి వైన్‌షాపు వెనుక 10 నుంచి 20 వరకు టేబుళ్లు వేసి మరీ విక్రయాలు
- ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పెడుతున్న అధికార పార్టీ నేత
- కళ్లెదుటే బెల్టుషాపులు కనిపిస్తున్నా చర్యలు శూన్యం
- ఎక్సైజ్ శాఖ ఏం చేస్తున్నట్లు ?

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా ఇక్కడి ప్రజాప్రతినిధికి 30 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇప్పటికే సదరు నేత అందరికీ హుకుం జారీ చేసినట్లు పచ్చ పత్రికలే కోడైకూస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం పాలసీకి ఈయన తూట్లు పొడుస్తున్నారు. నిబంధనలకు పాతరేస్తూ, అనధికార పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇప్పిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో చంద్రగిరి ఏ మద్యం దుకాణం వద్ద చూసినా బార్లను తలపిస్తున్నాయి. ఎంత ఎక్కువగా మద్యం విక్రయాలు జరిగితే.. అంత ఎక్కువగా కమీషన్ వస్తుందనే ఉద్దేశంతో అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. లోపల విచ్చలవిడిగా అనుమతి లేని తినుబండారాల విక్రయాలు.. బయట రోడ్లపై మందుబాబుల ఆగడాలు.. ఇష్టానుసారం వాహనాల పార్కింగ్.. ఇలా చంద్రగిరిలో ఎక్కడ చూసినా ఇదే తంతు కొనసాగుతోంది.


అగరాల సమీపంలో రోడ్డు పక్కనే మద్యం తాగుతున్న సేవిస్తున్న మందుబాబులు

అంతటా నిబంధనల ఉల్లంఘనే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాపులో మద్యం కొనుగోలు చేశాక, అక్కడ కూర్చుని తాగకూడదు. ఆహార పదార్థాలు విక్రయించకూడదు. కానీ చంద్రగిరి నియోజకవర్గంలో అంతటా విరుద్ధం. మద్యం దుకాణాల వద్ద కలిగే ఇబ్బందులపై కొన్ని ప్రాంతాల్లో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే మద్యం దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో మద్యంషాపుల నిర్వాహకులు ఇష్టానుసారంగా అనధికార పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా పల్లెలు, గ్రామాలలో ప్రశాంతతకు విఘాతం కలుగుతోంది. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలైన గాంధీపురం, శ్రీనివాసపురం, పద్మావతిపురం, తుమ్మలగుంట, చెర్లోపల్లి పంచాయతీల్లో ఉండే మద్యం షాపుల వద్ద నిత్యం జాతరను తలపిస్తోంది.

నిబంధనలకు తూట్లు ఇలా..

మద్యం దుకాణాల వద్ద ఎలాంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతి లేకపోయినా వైన్‌షాపు చుట్టూ పెద్దపెద్ద ప్రహరీలు నిర్మించి, విశాలమైన గదులను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో రూములో 10–20 టేబుళ్లు ఏర్పాటు చేయడంతో రాత్రి 12 గంటల వరకు మందు బాబులు తిష్ట వేస్తున్నారు. రెస్టారెంట్లను తలపించేలా అక్కడే అన్ని రకాల మాంసాహారాన్ని అందిస్తున్నారు. నాసిరకం నూనెలతో మాసాహారాన్ని వండి అందిస్తుండడం ప్రజారోగ్యానికి సవాల్‌గా మారుతోంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సైతం వీటివైపు చూడడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కాలేజీలకు దగ్గరగా వైన్ షాపులు, పర్మిట్ రూములు ఉండడంతో విద్యార్థులు మద్యానికి అలవాటు పడుతున్నారు.

> **రూ.5 లక్షల జరిమానా, లైసెన్స్ రద్దు..**
> మద్యం దుకాణాల వద్ద ఎలాంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతి లేదు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేస్తే మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా విధిస్తాం. రెండోసారి కూడా పట్టుపడితే ఏకంగా లైసెన్స్‌నే రద్దు చేసే అధికారం ఉంది. నిబంధనలను అతిక్రమించి ఎవరూ పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేయవద్దు.
> – నరసానాయుడు, సీఐ, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిల్

పద్మావతి వర్సిటీకీ మద్యం మకిలీ

పద్మావతి మహిళా వర్సిటీ ప్రహరీకి సమీపంలోనే సెవెన్ హిల్స్ పేరిట మద్యం షాపు ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో విద్యార్థినులు వర్సిటీకి, పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలకు ఈ రోడ్డులోనే వెళ్తుంటారు. కొందరు మందుబాబులు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం షాపుతో పాటు అనుబంధంగా వెనుక అనధికార పర్మిట్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశారని, అందుకోసం ప్రహరీని సైతం కూల్చి మార్గం ఏర్పాటు చేశారని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

భజరంగ్‌దళ్ గూండాల దాడి దారుణం


వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ చెంగయ్యపై భజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేయడం దారుణమని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వర్సిటీలో అన్యమత ప్రచారానికి తావులేదని, అలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. 70 ఏళ్ల యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మతాల ప్రస్తావన రావడం దారుణమన్నారు. బయట వ్యక్తులు యూనివర్సిటీ ప్రొఫెసర్ల మీద దాడి చేయడం వర్సిటీ ప్రతిష్ఠతకు భంగం వాటిల్లేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు అన్యమత ప్రచారాలు చేయడం ఏమాత్రం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చొరవ తీసుకోవాలని, బయటి వ్యక్తులను వర్సిటీలోకి అనుమతించకుండా సెక్యూరిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, పలు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పేరూరు చెరువుకు జలహారతి


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్: ఫెంగల్ తుపాన్ ప్రభావతంతో కురిసిన వర్షాలకు స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతోంది. తొండవాడ అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద స్వర్ణముఖి నది నుంచి పేరూరు చెరువుకు నీళ్లు వచ్చే లింక్ కాలువను ఇరిగేషన్ అధికారులు శుభ్రం చేయడంతో నీరు చేరింది. మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేరూరు చెరువు వద్ద జలహారతి ఇచ్చారు. దేవుడి దయ వల్ల మంచి వర్షాలు పడ్డాయని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చెరువులను నింపాల ని ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మణికంఠ


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ

చంద్రగిరి: భారత రాజ్యాంగం కల్పించిన దివ్యాంగుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని శ్రీపట్టెడన్నం సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ కోరారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం పట్టెడన్నం సేవాసమితి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వికలాంగుల పట్ల వివక్షత చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టెడన్నం సేవా సమితి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగవైకల్యం అడ్డు కాదు

తిరుపతి ఎడ్యుకేషన్ : పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, అభ్యున్నతికి అంగవైకల్యం ఎన్నటికీ అడ్డు కాదని తిరుపతి అర్బన్ ఎంఈఓ భాస్కర్ నాయక్ తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని భవిత కేంద్రంలో మంగళవారం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ తహ సున్నీసా బేగం, రామానాయుడు, నగరపాలక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భానుమతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

పాకాల : వైకల్యం అనేది శరీరానికే తప్ప మనసుకు కా దని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

దివ్యాంగులను ఆదరిద్దాం

రామచంద్రాపురం: దివ్యాంగులను ఆదరిద్దామని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. మంగళవారం స్థానిక భవితా కేంద్రంలో ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి, సహిత విద్య ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటితో శెట్టిపల్లి భూముల బహిరంగ విచారణ పూర్తి


తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద శెట్టిపల్లి భూబాధితులు

తిరుపతి అర్బన్: శెట్టిపల్లి భూసమస్యలు ఉన్న వారు తిరుపతి ఆర్డీఓ ఆఫీస్‌లో బహిరంగ విచారణ పేరుతో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి అర్బన్ తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తెలిపారు. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో రెండవ రోజు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు తహసీల్దార్ నేతృత్వంలో శెట్టిపల్లి భూములకు సంబంధించి బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో రోజు 387 నుంచి 408 సర్వే నంబర్ వరకు అర్జీలను స్వీకరించామని, మొత్తం 261 మంది తమ వద్ద ఉన్న భూహక్కుపత్రాలను సమర్పించారని చెప్పారు. 3వ రోజు బుధవారం 409 నుంచి 427 వరకు, అలాగే 475 సర్వేనంబర్‌కు చెందిన వారు తమ వద్ద ఉన్న భూహక్కుపత్రాలతో పాటు అర్జీలను అందజేయాలని కోరారు. నేటితో కార్యక్రమం ముగుస్తున్న నేపథ్యంలో శెట్టిపల్లి భూసమస్యలకు చెందిన వారు పైన తెలిపిన సర్వే నంబర్ల ప్రకారం భూహక్కుపత్రాలను సమర్పించి సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు అశోక్‌రెడ్డి, రామచంద్ర, కిరణ్, వీఆర్వోలు ప్రసాద్, సుమన్, శెట్టిపల్లి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయ భూముల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని రేఖలచేనులో గల జన్మస్థల శివాలయ భూములను తహసీల్దార్ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మస్థల శివాలయ భూములపై సోమవారం పలువురు గ్రామస్తులు జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఈ మేరకు ఆర్ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్‌బాబుతో కలసి నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు సమర్పించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు


వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

చంద్రగిరి/తిరుపతి కల్చరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజైన మంగళవారం ఉదయం సర్వభూపాల వాహన సేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళా బృందాలు అద్భుత ప్రదర్శనలు ఇచ్చాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 12 కళా బృందాలలోని 254 మంది కళాకారులు సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవశింపజేశారు. తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రతి వాహనం ముందు పౌరాణిక ఇతివృత్తాల విశిష్ట ప్రదర్శనతో భక్తుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. రాజమండ్రికి చెందిన 30 మంది కళాకారులు సంప్రదాయ ఢమరుకం– గిరిజ నృత్యం, తెలంగాణకు 26 మంది కళాకారుల బోనం–కోలాటం, లంబాడి డ్యాన్స్, కడపకు చెందిన బాబు బృందం కడప డ్రమ్స్ భక్తులను అలరించాయి. అదేవిధంగా బెంగళూరుకు చెందిన నృత్య గంగా కళా కేంద్రానికి చెందిన 25 మంది యువతులు శ్రీ మాత నమః నృత్యం, తిరుపతికి చెందిన 28 మంది దాస సాహిత్య కళాకారులు రాధాకృష్ణ నృత్యం, కోలాటాలు నేత్రపర్వంగా సాగాయి.




పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆకట్టుకున్న కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు

రాయలసీమ అభివృద్ధిపై శీతకన్ను


రవిశంకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన రాయలసీమలో వ్యవసాయ, నీటిపారుదల, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేయాలన్నారు. గాలేరు–నగరి, హంద్రీనీవా పూర్తి చేస్తే రాయలసీమ ప్రాంతంలో 10 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధిపై శీతకన్ను వేస్తోందని, ఇక్కడి నుంచి సంస్థలు, పరిశ్రమలను తరలించడం దుర్మార్గమన్నారు. వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వర్షాలకు తెగిన రోడ్డు


కొట్టుకుపోయిన రోడ్డు

చంద్రగిరి: మండలంలోని నడింపల్లి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి వర్షాలకు కొట్టుకుపోవడంతో జనం గ్రామంలో నుంచి జాతీయ రహదారిలోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముంగిళిపట్టు పంచాయతీలో ఎం.కొత్తపల్లి, బీసీకాలనీ, ఎస్సీ కాలనీ, నడింపల్లి, ఎస్టీ కాలనీలకు వెళ్లేందుకు గతంలో బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే గత నాలుగేళ్ల కిందట పడిన భారీ వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోవడంతో అప్పటి ప్రభుత్వం గ్రామస్తుల కోసం తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ తాత్కాలిక రోడ్డు కూడా కొట్టుకుపోయింది. దీంతో ఎం.కొత్తపల్లి వాసులు గ్రామం నుంచి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా నల్లబండ చెరువు

పాకాల : మండలంలోని మద్దినాయనపల్లికి సమీపంలోని నల్లబండ చెరువు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రమాదకరంగా మారింది. మూడేళ్ల కిందట ఈ చెరువుకు గండి పడింది. తాజాగా నల్లబండ చెరువుకు గండి పడడంతో పాటు ఉప్పొంగి పొర్లుతోంది. అధికారులు స్పందించి చెరువుకు, చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని చెరువు కింద ఉన్న ఆయకట్టుదారులు, లోతట్టు ప్రాంతంలో ఉన్న మద్దినాయనపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం మద్దినాయనపల్లికి వెళ్లే మార్గానికి రాకపోకలు నిలిచిపోయాయి.


మద్దినాయనపల్లికి నిలిచిపోయిన రాకపోకలు


పొంగి పొర్లుతున్న నల్లబండ చెరువు

శ్రీవారి పాదాలు ఊరేగింపు


పూజలనంతరం తిరుచ్చి వాహనంపై వస్తున్న పాదాలు

చంద్రగిరి: గరుడోత్సవం పురస్కరించుకుని శ్రీవారి పాదాలను మంగళవారం తిరువీధుల్లో వేడుకగా ఊరేగించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు రాత్రి అమ్మవారికి గరుడసేవ నిర్వహిస్తారు. శ్రీవారి వాహనమైన గరుడపై ఊరేగే అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా సర్వభూపాల వాహనసేవ అనంతరం శ్రీవారి పాదాలను గ్రామ ముఖద్వారంలోని పసుపు మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ శ్రీవారి పాదాలను బంగారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి గరుడవాహన సేవలో శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు శ్రీవారి పాదాలతో భక్తులను అనుగ్రహించారు. జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.